ఏయూ విద్యార్థులకు సివిల్స్ శిక్షణ

- ఆర్ట్స్ కళాశాలలో ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఏర్పాటు
- విభాగం ఆధునికీకరణకు దిశానిర్దేశం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సివిల్స్ వంటి యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ప్రత్యేకంగా ఐఏఎస్ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేస్తామని వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఆర్ట్స్ కళాశాల భవనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో పలు గదులు ఖాళీగా ఉండటాన్ని గమనించారు. గతంలోనే ఈ గదులను ఖాళీ చేసి ప్రిన్సిపాల్‌కు అప్పగించాలని సూచించినా ఎందుకు చేయలేదని విభాగాధిపతులను ప్రశ్నించారు. వెంటనే ఖాళీ గదులను స్వాధీనం చేసుకోవాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఆర్ట్స్ కళాశాల మొదటి అంతస్తులో యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉపయుక్తంగా ఐఏఎస్ స్టడీ సెంటర్‌ను నెలకొల్పడానికి అనువుగా ఉంటుందని సూచించారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేపట్టాలని పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ జి.వీర్రాజుకు సూచించారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన భవనంలో అవసరమైన మరమ్మతులు చేపట్టేలా ఇంజినీరింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవనానికి నూతనంగా లిఫ్ట్ ఏర్పాటు చేస్తున్న స్థలాన్ని పరిశీలించారు. భవనంలో టాయిలెట్స్ మరమ్మతులు, విద్యార్థినుల రెస్ట్‌రూమ్‌లో వసతులు పెంచాలని చెప్పారు. టాయిలెట్స్ శుభ్రం చేయడానికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలన్నారు. త్వరలో భవనానికి పూర్తి స్థాయిలో పెయింటింగ్ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, యూనివర్సిటీ ఇంజినీర్ ఆర్.శంకరరావు, ఆర్కిటెక్ట్ భీమేష్, విభాగాధిపతులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ సమాచారం..

ఐపీఆర్ క్విజ్ విజేతలకు అభినందన

ఏయూ క్యాంపస్: ప్రపంచ మేధో హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూలోని డీపీఐఐటీ–ఐపీఆర్ చైర్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 900 మందికి పైగా విద్యార్థులు పోటీ పడ్డారు. ఏయూ బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థిని ఎ.వైష్ణవి ప్రథమ, చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బి.భాస్కరరావు ద్వితీయ, ఏయూ సీఎస్ఈ విద్యార్థిని ఎం.హేమప్రేరణ తృతీయ బహుమతిని సాధించారు. విజేతలకు ఏయూ వీసీ తన కార్యాలయంలో ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఏయూ డీపీఐఐటీ–ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, యు.అశోక్ హేమంత్, హరిత పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ప్రతిభతోనే ఉద్యోగ అవకాశాలు

ఏయూ క్యాంపస్: ప్రతిభతోనే మెరుగైన ఉపాధి అవకాశాలు సాధ్యపడతాయని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అధికారి సుధీర్ రాజా అన్నారు. శుక్రవారం ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో టాలెంట్ ఎక్విజేషన్ అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. పుస్తక జ్ఞానంతో పాటు ఉద్యోగాన్వేషణలో అవసరమైన విభిన్న నైపుణ్యాలను తెలియజేశారు. విభాగం తరపున సుధీర్‌రాజాను సత్కరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ప్లేస్‌మెంట్ అధికారి వి.ఆర్.రెడ్డి, మోహన్ గణేష్, ఆచార్య ఎస్.సాంబశివరావు, డాక్టర్ సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.


సుధీర్‌రాజాను సత్కరిస్తున్న విభాగ ఆచార్యులు

కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి


ఏయూ క్యాంపస్: యువత తమ కాలాన్ని సద్విని యోగం చేసుకుంటూ ఉన్నతంగా ఎదగాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. శుక్రవా రం ఏయూ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులకు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో రెండో రోజు విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ భావ వ్యక్తీకరణ నైపుణ్యా లు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిర్దిష్ట లక్ష్యంతో పని చేస్తూ ఉన్నత భవిష్యత్‌ను సొంతం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.హరనాథ్, డాక్టర్ రాములు, డాక్టర్ జె.ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

క్లుప్తంగా

ఏఆర్ పోలీసులకు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


ఏఆర్ పోలీస్ మైదానంలో మాట్లాడుతున్న అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ

ఆరిలోవ: ఏఆర్ పోలీసులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. విశాలాక్షినగర్‌లో కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన స్టాఫ్ పరేడ్‌ను ఆయన సందర్శించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ 50 సంవత్సరా లు దాటిన ఏఆర్ పోలీసులు ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇంత వరకు ఏఆర్‌లో పనిచేస్తున్న సుమారు 200 మందికి పైగా ఉచితంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించామన్నారు. వారంతా వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడి ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలి


డీఈవో కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ సభ్యులు

ఆరిలోవ: ఉపాధ్యాయుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. బదిలీలు, ప్రమోషన్లు అనంతరం కేడర్ స్ట్రెంత్ అప్‌డేషన్ లేకపోవటంతో రెండు నెలలుగా వేతనాలు చెల్లించని పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయులకు ఈ నెల సప్లిమెంటరీ బిల్లులు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డీఈవో ఎల్.చంద్రకళకు వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు సత్యం, రియాజ్, ప్రసాద్, నూకరాజు రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

జీవో–21 రద్దుకు డిమాండ్



నిరసన చేపడుతున్న ఆటో డ్రైవర్లు

మద్దిలపాలెం : జీవో నంబర్–21ని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం విశాఖ ఆటో రిక్షా కార్మికుల సంఘం మద్దిలపాలెం జోన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ ఆటో కార్మికులకు ఆర్థిక భారంగా మారిన జీవో నం. 21ను రద్దు చేయాలన్నారు. ఆటో డ్రైవర్లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీవో, పోలీసులు వేస్తున్న ఈ చలనాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం తెలుగుతల్లి విగ్రహం వద్ద ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు.

మహాశక్తి చైతన్య రథం ప్రారంభం

ఎంవీపీ కాలనీ: రాష్ట్రంలోని మహిళలకు భరోసా కల్పించే సంకల్పంతో టీడీపీ చేపట్టిన చైతన్య రథం మహాశక్తి యాత్రను మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఎంవీపీ కాలనీలోని తన నివాసం వద్ద శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో మహిళలకు పూర్తి న్యాయం జరిగిందన్నారు. మహిళల్లో చైతన్యం తీసుకొచ్చే దిశగా 40 రోజుల పాటు ఈ యాత్ర కొనసాగుతుందని వెల్లడించారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ


12వవార్డులో బాలింతలకు పోషణ కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ రోహిణి


13వ వార్డులో బాలింతలకు పోషణ కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ కార్యక్రమాలు తూర్పు నియోజకవర్గంలో వాడవాడలా జరిగాయి. ఇందులో భాగంగా శుక్రవారం 12వ వార్డు నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి బాలింతలు, గర్భిణులకు పోషణ కిట్లు అందజేశారు. 13వ వార్డు ఏఎస్ఆర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు కార్పొరేటర్ కెల్ల సునీత పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అంధకారంలో గ్రీన్‌బెల్ట్

మద్దిలపాలెం: జాతీయ రహదారికి ఆనుకుని శోభాయమానంగా తీర్చిదిద్దిన గ్రీన్ బెల్ట్‌లు ఎంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడి ఓపెన్ జిమ్‌లు నగరవాసులతో కళకళలాడుతున్నాయి. అయితే చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. వీధి దీపాలు లేక అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నాయి. జాతీయ రహదారికి ఇరువైపులా గ్రీన్ బెల్ట్‌కు రక్షణగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ చాలా చోట్ల ధ్వంసమైంది. తూర్పు నియోజకవర్గం పరిధిలో సత్యం జంక్షన్ నుంచి హనుమంతవాక వరకు హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్‌లను గతంలో ఆధునికీకరించారు. అయితే రాత్రి వేళల్లో చీకటి కమ్ముకుంటున్నాయి. జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి ఈ పార్కులో సోలార్ దీపాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


సీఎంఆర్ సెంటర్ వద్ద గ్రీన్‌బెల్ట్‌లో చీకటిమయంగా ఉన్న దృశ్యం

శాంతి భద్రతలకు విఘాతం కలిగితే కఠిన చర్యలు

- సీపీ త్రివిక్రమ వర్మ
- ఎంవీపీ పోలీసు స్టేషన్ సందర్శన

ఎంవీపీ కాలనీ: నగర పోలీసు కమిషనర్ త్రివిక్రమ వర్మ శుక్రవారం ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఎంవీపీ పోలీసు స్టేషన్‌కు వచ్చినట్లు ఆయన రికార్డులను పరిశీలించారు. జనరల్ డైరీ, విధులపై ఆరా తీశారు. స్టేషన్ పరిధిలో ఎంతమంది రౌడీ షీటర్లు ఉన్నారు.. వారిపై ఎలాంటి నిఘా అమలు అవుతుందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మీడియాతో మాట్లాడుతూ నగరంలో గత నాలుగు నెలలుగా క్రైమ్‌తో పాటు ట్రాఫిక్ ప్రమాదాలు తగ్గినట్లు వెల్లడించారు. రౌడీషీటర్లు, గంజాయి రవాణా నిందితులపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలిగినా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తూర్పు ఏసీపీ ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, సీఐ మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న సీపీ త్రివిక్రమ వర్మ

'భర్త నుంచి రక్షణ కల్పించండి'

సీతమ్మధార: 'నా భర్త నుంచి నాకు ఆత్మరక్షణ కల్పించండి' అని పోలీసులను భర్త చేతిలో దాడికి గురైన అల్లు శారద వేడుకుంది. శుక్రవారం ఆమె ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. వివరాలిలా.. జీవీఎంసీ 45వ వార్డు గురునాథ్ కాలనీలో అల్లు రాము, శారద దంపతులు నివసిస్తున్నారు. వీరికి పాప, బాబు ఉన్నారు. ఈ నెల 2వ తేదీ బుధవారం సాయంత్రం రాము మద్యం కోసం తన భార్యను డబ్బులు అడిగాడు. ఆమె తన వద్ద లేవని చెప్పడంతో అతడు కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. స్థానికుల సహకారంతో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో బాధితురాలు చికిత్స పొందింది. ఈ నేపథ్యంలో 'సాక్షి'తో అల్లు శారద మాట్లాడుతూ తనకు తన భర్త నుంచి ప్రాణహాని ఉందని చెప్పింది. ఇద్దరు చిన్నపిల్లలతో భయంగా గడుపుతున్నట్లు వాపోయింది. తన భర్త రాము పోలీస్ స్టేషన్‌లో ఉన్నప్పటికీ రాత్రి వేళ ఇంటికి వచ్చి దాడి చేస్తాడేమోనని భయాందోళనలు చెందినట్లు తెలిపింది. పోలీసులు తనకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేసింది.



పిల్లలతో బాధితురాలు అల్లు శారద

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.


జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

అనధికారిక అదనపు అంతస్తు తొలగింపు


ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో ఓ వ్యక్తి చేపట్టిన అనధికారిక అదనపు అంతస్తును టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. శుక్రవారం జోన్–2 సీపీ వెంకటేశ్వరరావు ఆదేశాలతో స్క్వాడ్ సిబ్బంది వెళ్లి అక్రమ కట్టడాన్ని కూల్చివేశారు. కోఆపరేటివ్ బ్యాంక్ సమీపంలో ఓ వ్యక్తి నాలుగు అంతస్తులకు టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి అనుమతి తీసుకున్నాడు. అక్కడితో ఆగకుండా అనధికారికంగా ఐదో ఫ్లోర్ నిర్మించేశాడు. దీనిపై ఫిర్యాదులు రావడంతో ఏసీపీ స్పందించి స్క్వాడ్ సిబ్బంది రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం అదనపు అంతస్తును తొలగించారు.

నీటి నిల్వలు దోమల ఉత్పత్తికి కారణం


మద్దిలపాలెంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మలేరియా సూపర్‌వైజర్ రత్నం

మద్దిలపాలెం: దోమల వ్యాప్తికి కారణమైన ఇంటి పరిసరాలలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించాలని జిల్లా మలేరియా విభాగం సూపర్‌వైజర్ వై.ఎస్.రత్నం సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం మద్దిలపాలెం, సింహాద్రిపురంలో పరిశీలించారు. ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, జీవీఎంసీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిల్వ నీటిలో ఉండే లార్వాను తొలగించారు. ఈ సందర్భంగా దోమల ఉత్పత్తి విధానాన్ని కాలనీ వాసులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ మలేరియా సిబ్బంది, సచివాలయాల ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉపనిషత్తుల వైశిష్ట్యంపై ప్రసంగం


ప్రసంగిస్తున్న దేవులపల్లి పద్మజ

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో జరుగుతున్న ఆధ్యాత్మిక లహరి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఉపనిషత్తుల వైశిష్ట్యంపై రచయిత్రి దేవులపల్లి పద్మజ ప్రసంగించారు. ముందుగా ముఖ్య అతిథి పూర్ణానంద స్వామి ఉపనిషత్తులను పరిచయం చేశారు. చివరిగా లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అనుగ్రహ భాషణం చేశారు. ఉపనిషత్తులు వేదాంతమని, అనేత సత్యాలను, ఆత్మతత్వాన్ని లోకానికి రుషులు అందించారని ఉపదేశించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ సారథ్యంలో వక్త పద్మజను సన్మానించారు.

ఎస్సీ కాలనీలో ఆర్డీవో పర్యటన


వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో భాస్కర్‌రెడ్డి

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది ఎస్సీకాలనీలో ఆర్డీవో భాస్కర్‌రెడ్డి శుక్రవారం పర్యటించారు. సర్వే నంబర్ 159/5 లో ముప్పై ఏళ్ల నుంచి 50 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరికి ఇప్పటి వరకు పట్టాలు మంజూరు కాకపోవడంతో వారు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి ఆదేశాల మేరకు ఆర్డీవో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ సుమారు 1.05 ఎకరాల్లో 50 కుటుంబాలు నివసిస్తున్నాయని, వీటిపై నివేదికను తయారు చేసి ఉన్నత అధికారులకు అందిస్తామని తెలిపారు.

శెట్టిబలిజలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

సీతంపేట: శెట్టిబలిజ కులస్తులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని పలువురు వక్తలు కోరారు. శెట్టిబలిజల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శెట్టిబలిజ సంఘ నాయకులు, సభాధ్యక్షుడు కట్టా మల్లేశ్వరరావు మాట్లాడుతూ విశాఖలో శెట్టిబలిజ, యాత, శ్రీశయన, గౌడ కులస్తులు 4 లక్షల ఓటర్లు ఉన్నప్పటికీ ఏ రకమైన రాజకీయ ప్రాధాన్యం లేకపోవడం అన్యాయమన్నారు. ప్రతి నియోజకవర్గంలో తమ కులస్తుల ఓట్లు 30 వేల నుంచి 40 వేలకు ఉన్నాయని తెలిపారు. 2024 ఎన్నికల్లో శెట్టిబలిజ కులాలకు ప్రాధాన్యమిచ్చే రాజకీయ పార్టీలకు మాత్రమే తమ మద్దతు ఉంటుందన్నారు. విశాఖలో ఒక ఎమ్మెల్యే, ఒక నామినేటెడ్ పదవిని కేటాయించిన పార్టీకి మద్దతు పలుకుతామని స్పష్టం చేశారు. సింహాచలం దేవస్థానం ట్రస్టీ సంపంగి శ్రీనివాసరావు మాట్లాడుతూ శెట్టిబలిజ కులాలను సంఘటిత పరిచి, ఒక తాటిపైకి తీసుకొచ్చి త్వరలో భారీ ఎత్తున మహానాడు సభ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా శెట్టిబలిజ కులస్తులు, వివిధ హోదాల్లో పదవీ విరమణ చేసిన ప్రముఖ వైద్యాధికారులను ఘనంగా సత్కరించారు. విశ్రాంత రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ కడలి సత్యవరప్రసాద్, మానసిక ఆస్పత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ కుముజు నరసింహారెడ్డి, పోర్టు ఆస్పత్రి డెర్మటాలజిస్ట్ యాండ్ర రాంప్రసాద్, కేజీహెచ్ గైనకాలజిస్ట్ యాండ్ర లక్ష్మీ నరసింగరావు, ఏఎంసీ ఆప్తమాలజిస్ట్ చెల్లుబోయిన మంగా వెంకట్‌లను దుశ్శాలువాతో సన్మానించారు. ఇటీవల జీవీఎంసీ కార్పొరేటర్లుగా, నామినేటెడ్ పదవులు పొందిన వారిని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కడలి సుబ్బారావు, వాసర్ల బాలకృష్ణ, కడలి శివ కేశవ నరసింహారావు, కేతా గంగరాజు, గుత్తుల వెంకటేశ్వరరావు, గుత్తుల సుబ్రహ్మణ్యం, కట్టా శ్రీకాంత్, గుత్తుల రాజశేఖర్, రాయుడు శివరామకృష్ణ పాల్గొన్నారు.


అతిథుల చేతుల మీదుగా సత్కారం పొందిన వైద్యాధికారులు

అలరించిన సాంఘిక నాటికలు

మద్దిలపాలెం: విశాఖ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం ప్రదర్శించిన రెండు సాంఘిక నాటకలు ఆకట్టుకున్నాయి. ఈ నాటిక ప్రదర్శనలను వీఎండీఏ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు, ఫైడా కృష్ణ ప్రసాద్, జగత్‌రాయ్, నాంచారయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం తొలి ప్రదర్శనగా డి.సత్యనారాయణ దర్శకత్వంలో రావి నాగేశ్వరరావు రచించిన అమ్మ మారిపోయింది నాటికను కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. ఈ నాటికలో ప్రతి సన్నివేశం ప్రేక్షకులను కదిలించింది. రెండో ప్రదర్శనగా పుష్పమి దర్శకత్వంలో కె.వి.మెమోరియల్ ఆర్ట్స్ యూనిట్ రచించిన అడ్రస్ లేని మనిషి నాటిక ఆలోచింపజేసింది. ఈ నాటికలకు సౌజన్య ఉక్కు కళా స్రవంతి కళాకారులు ప్రదర్శించారు.


అమ్మ మారి పోయింది నాటికలో ఓ సన్నివేశం

రెండు కార్లు ఢీ


ముందు భాగం నుజ్జయిన కారు



డివైడర్ పైకి ఎక్కిన కారు

కొమ్మాది : రుషికొండ బీచ్‌రోడ్డులో రెండు కార్లు ఢీకొన్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఈ మేరకు రుషికొండ నుండి దూసుకు వస్తున్న ఓ కారు ఇస్కాన్ టెంపుల్ వద్ద యు టర్న్ తీసుకుంటున్న మరో కారును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ కారు నుజ్జునుజ్జు కాగా మరో కారు డివైడర్‌ను ఢీకొట్టి పైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా జరిగాయి. ముందుగా శ్రీవారికి అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకువెళ్లారు. అభిషేకాల అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. నగరానికి చెందిన జ్యోతి కుటుంబ సభ్యులు శ్రీవారికి పట్టువస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.